

# సంస్కారానికి సరిహద్దు

కుమారి ఘట్రాజు సుధ




సరిగ్గా పంద్రెండు గంటలు కొట్టింది దూరంగా వున్న టవర్ క్లాక్. బయట ఎండ మండిపోతోంది. వచ్చే పోయే వాళ్ళతో హాస్పటల్ చాలా రద్దీగా వుంది. అందులో ఈ రోజు విజిటర్స్ డే. అన్ని హాస్పిటల్స్‌లో లాగా ఏక్సిడెంటులవాళ్ళ ఏడుప్పులు, ఆపరేషన్లు, ఎమర్జెన్సీ హడావిడి లేదు పేషంట్లు తాలూకవాళ్లు వస్తున్నారు పోతున్నారు. వచ్చేప్పుడున్న సంతోషము ఆత్రుత వెళ్ళేప్పుడు మచ్చుకైనా ఒక్కళ్ళలో కూడా లేదు. కొందరి ముఖాల్లో మాత్రం మొండి ధైర్యం కన్పిస్తోంది వాళ్ళ గుండె ఎప్పుడో రాయి అయిపోయింది

పాపం! ఈ వాతావరణానికి అలవాటు పడని వాళ్ళ బాధ వర్ణనా తీతం! అవ్యక్తం గాని మూగ ఆ వేదన అణుక్షణువూ దహిస్తూంటే, ఆ ఆ వేదనాగ్నికి ఆవిరి అయిపోతున్న మనస్సు నిగ్రహించుకోలేక ఈమిలిపోతూ డాక్టరు చెప్పబోయే ఉపశమన వాక్యాలకోసం ఎదురుచూస్తున్నారు.

డాక్టర్ కృష్ణమోహన్ వచ్చిన వాళ్ళనందరిని ఓపిగ్గా వోదార్చి పంపేస్తున్నాడు. తను మాత్రం ఏం చెయ్యగలడు? శరీరానికి వచ్చే వ్యాధులు కుదిరినంత త్వరగా మానసిక వ్యాధులు కుదరవుగా! అది ఎటువంటికేసో తెల్సుకోవడానికే టైము పడుతుంది ఒకొక్కసారి! పేషంటు విజయసారధికోసము అతని తాతగారు వచ్చి వెళ్లారు. వారం రోజులనుంచి చూస్తున్నాడు, సారధి విషయము ఒక పట్టాన అంతు పట్టడంలేదు. పలకరిస్తే పలకడు. ఉలకడు. అసలు జవాబు చెప్పడు. పరధ్యానంగా వుంటాడు. బహుశా అతని మనస్సు పరలోకాల్లో విహరిస్తుంటుంది కాబోలు. పిచ్చివాడిలా కేకలు వెయ్యడు, గోలచెయ్యడు, గతించిన జ్ఞాపకాలతో సమాధి అయిపోయాడు. అందంగావున్న నర్సుల్ని. ఇలాంటి కేసుల్ని అతినేర్పుతో ఓర్పుగా, బాగా చూసే వాళ్ళని. పెట్టి చూశాడు. ఎలాగైనా సారధినిదైనిక జీవిత మాధుర్యం చవి చూపించాలని తాపత్రయ పడుతున్నాడు. కాని ఎటువంటి వారికి లొంగని అలౌకిక ప్రపంచములో విహరిస్తున్న సారధి ఒక్కరికీ అందలేదు. అంతు పట్టలేదు.

ప్రేమించడం అందరి చేత కాదు.
ప్రేమించే ఆత్మస్థైర్యం మహాబలం వున్నవాడే ప్రేమించాలి.
పెదవి విప్పి మనసులోని మాట బయట పెట్టలేని పిరికివాడికి
ప్రేమ ఏమిటి?

ఎదురుగా వున్న కుర్చీలో సారధి కూర్చున్నాడు. నర్స్ ప్రియం వద కృష్ణమోహన్ అడిగినపుస్తకంఅందించి అక్కడే నుంచుని, కృష్ణమోహన్ చూస్తున్న కాగితాలలోకి తదేకంగా చూస్తున్నది. ఎవరితోను సంబంధం లేనివాడిలా కళ్లు మూసుకొని ధ్యానముద్రలో వున్నట్లు కూర్చున్నాడు. ఎవరి ఆలోచనల్లో వాళ్లు నిమగ్నమైపోయారు. ఇంతలో స్ప్రింగ్ డోర్ తలుపులు తెరుచుకొని అందమైన యువతి వయ్యారంగా లోపలికి వచ్చింది. చిరునవ్వు ఆమె లేత పెదవులమీద చిందులు




త్రొక్కుతోంది! కృష్ణమోహన్ ఆలోచనా నిమగ్నుడై ఆమె రాకను గమనించలేదు. నర్స్ ప్రియంవద పెదవులు స్వాగతపూర్వకంగా నవ్వాయి: తన వెనక మనిషి అలికిడికి సారథి చివ్వున వెనక్కి తిరిగాడు. పిచ్చిగా ఆమెని చూడసాగాడు, తళుక్కుమన్న కాంతి అతని కన్నులలో మెరిసింది. తటాలున తను కూర్చున్న కుర్చీలోంచి లేచాడు—

"నువ్వు.... నువ్వు.... నన్ను నమ్మించి నా.... నోరు నొక్కేశావు, నన్ను మోసం చేశావు. నువ్వు....వుత్తదగా కోరువి, దయలేని పాషాణానివి. రాక్షసీ" వుద్రేంగా గట్టిగా కేకలు వేయసాగాడు సారథి.

క్షణకాలంలో అక్కడ ఆక్రమించిన నిశ్శబ్ద వాతావరణము భగ్నమయ్యింది. మూగవాడిలా పడివున్న సారథిలో ఒక్కసారి వెల్లువలాగా చైతన్యవంతమైన వుద్రేకంగా మాటలు వెలువడుతున్నాయి.

కృష్ణమోహన్ తల ఎత్తేప్పటికి సారథి ఆ యువతి జబ్బలను గుచ్చి పట్టుకొని బలంగా వూపుతున్నాడు. బెదరిపోయిన ఆమె, చెదరిన మనస్సుతో, అతని వూపు నాపుకోలేక,నిస్సహాయురాలై ఓడిపోయిన సిపాయిలా అతని చేతులమధ్య వుండిపోయింది. కృష్ణమోహన్ కొద్దిసేపట్లో ప్రియంవద సహాయముతో ఆమెను విడిపించి సారథిని బలవంతాన అతని గది

లోకి త్రోసి తలుపు వేశాడు. సారధి గట్టిగా ఏడుస్తూ కేకలు వేస్తున్న శబ్దము వినిపిస్తోంది. తెల్లగా పాలిపోయిన ముఖంతో అమె తూలిపోతూ. ఆసరగా వచ్చిన కృష్ణమోహన్‌పై వాలిపోయింది. అనుకోని ఈ ఆకస్మాత్ సంఘటనతో ఆమె స్పృహ కోల్పోయింది.

అర గంట తర్వాత కాస్త తేరుకొన్న ఆ యువతిచేత బలవంతంగా కాఫీ త్రాగించాడు కృష్ణమోహన్ ఆమె ముంగురులు సవరిస్తూ 'ఎందు కొచ్చావు రాధీ'' అన్నాడు లాలనగా కృష్ణమోహన్

''మిమ్మల్ని లంచికి ఇంటికి తీసుకెడదామని, కారు తీసుకొచ్చాను'' ఆగి ఆగి జవాబిచ్చింది రాధిక.

'పిచ్చివాళ్ళు వున్మాద స్థితిలో అలా ప్రవర్తిస్తుంటారు నువ్వు ఇదేం మనసులో పెట్టుకోకు. వెడదాం పద'' అంటూ రాధిను బయలుదేర తీశాడు. కృష్ణ మోహన్.

ఈ హఠాత్ సంఘటనతో నడవడానికి కూడా వీలులేనంతగా పీరపించి పోయిన రాధిక లేచి నిలబడింది. కాని మరుక్షణమే ఆమె తూలిపోతున్న సంగతి గ్రహించిన కృష్ణమోహన్ ఆమెను పట్టుకొని మెల్లిగా నడిపించుకొంటూ కారు వున్న చోటికి తీసుకొచ్చాడు. సారధి కిటికీలోంచి బయటికి చూస్తే వచ్చే పోయేవాళ్ళు కన్పిస్తారు. కిటికీ దగ్గర నుంచున్న సారధి వెళ్ళిపోతున్న రాధికా కృష్ణమోహన్‌లను చూడటంతోనే

''రా... ధీ....వెళ్ళిపోతున్నావా'' అతి దీనాతిదీనంగా అరుస్తూ తల కిటికీ కడ్డీలకు కొట్టుకుంటూ ఏడువసాగాడు.

అతని అరుపుకి వెడుతున్న ఇద్దరూ వెనక్కి తిరిగి చూశారు. రాధిక కన్నులలో కన్నీరు క్రమ్ముకోవటంతో ఎదురుగా వున్న కారు మసక మసగ్గా కనిపించింది. వచ్చే దుఃఖాన్ని అతి ప్రయత్నము మీద, ద్రిగమింగుకుంటూ ఏలాగో కారులోకివచ్చి కూర్చుంది. కారు డ్రైవ్ చేస్తున్న కృష్ణ మోహన్ ముఖంలో గంభీర్యం కొట్టొచ్చి నట్లు కనపడుతోంది. అతని మెదడులో తళుక్కున వింత అలోచన మెరుపులా మెరిసి మాయమయ్యింది. సారధి డైరీలో విషయాలు అతని మెదడ్ని కుమ్మరి పురుగులా దొలవసాగాయి: రాధికకి ఆ డైరీలు చదవడానికి ఇవ్వాలని మనస్సులో కృత నిశ్చయంచేసుకొంటూ ప్రక్కనకూర్చున్న రాధిక మీదకి తన చూపులు త్రిప్పాడు. ఆమె కళ్ళు మూసుకొని వెనక్కి జారగిలబడి కూర్చుంది. ఆమె కన్నులలో కన్నీరు ఆపడానికి ప్రయత్నం చేసినా ఆగక అవి ధారళంగా కారిపోతున్నాయి. ఏదో మాట్లాడాలను కొన్న కృష్ణమోహన్ మారు మాట లేకుండా మౌనం వహించాడు.

* * *

ఆ మర్నాడు—

కృష్ణమోహన్ హాస్పిటల్‌కి వెళ్ళిపోయాడు. బెడ్‌మీద తీరిగ్గా పడుకొని,

కృష్ణమోహన్ యిచ్చిన సారధి డైరీలు చదవసాగింది రాధిక. అన్నీ అతి సామాన్యంగా వున్నాయి. యదాలాపంగా ముందు పేజీ త్రిప్పింది.

"రాధికా. నా ప్రణయ దేవతా—" తన పేరు. ఆ సంబోధనకు ఆమె ఉలిక్కి-పడింది. క్షణకాలాంతరము మళ్ళీ చదవటము మొదలు పెట్టింది.

"రాధికా. నా ప్రణయదేవతా! సారధి జీవితానికి నీవే సారధివి! ఇన్నాళ్ళ నా నిరీక్షణా, ఆరాధనా ఈ రాధ కోసమే! దూరంగా వున్నప్పుడు చూశాను. చేరువ అవగానే చెప్పలేని ఈ ఆనందాన్ని నా మనస్సు మోయలేకున్నది. ఆ జింక కళ్ళు జిగేలు మనే చూపు, నా కాళ్ళకి నీ చేరువుగా లాక్కెళ్ళుతున్నాయి. కాని ఎందుకో ఈ పెదవులు బిగుసుకు పోతున్నాయి. మనస్సులోని మాటని, ఆ మందిరంలోనే వుంచి తాళము వేస్తున్నాయి ఏం చెయ్యను, ఎలా చెప్పను? ఏ దేవతలైనా దయ తలచి, నన్ను కనికరించి నా మనసులోని మాటని నీకు తెలుపుతే బాగుండును. రాధ . నీ పాట ఎంత తియ్యగా వుంది!

"రాధ" చదువుతున్న రాధిక త్రుళ్ళి పడింది ఆ సంబోధనకి. తననే ఆ పిలుస్తోంది. ఇదంతా తన గురించే వ్రాస్తున్నది. రాధికకి తన గుండె కొట్టుకుంటున్న దడదడ శబ్దము వినిపిస్తోంది. తన ఆలోచనలని ఒక ప్రక్కకి నెట్టి మళ్ళీ చదవటము మొదలు పెట్టింది.

"రాధ...ఈ పాటలే లేకపోతే మనము కలసే వాళ్ళమే కాదు కదూ! నీ పాటలో నా మాట కలిపి ఎన్ని రాగాలు పాడానో! ఆ రాగాలలో నా అనురాగాన్ని పొదవి నీకు సశ్శబ్దంగా అంకితము చేశానో, నీకు ఎలా తెలుస్తుంది? నా కంటే నువ్వు బాగా పాడుతావు నేను నీకు పాట డైరెక్టు చెయ్యడ మేమిటి? మన వాళ్ళకి అసలు మతిలేదు! నువ్వే నా కున్న మతి పోగొడుతున్నావు. నీ పాటలోని రాగాలు గట్లు తెగిన సెలయేరుల్లా గలగల పారుతూ మెలికలు తిరిగి. ప్రతి మెలిక దగ్గరానన్ను చుట్టేస్తున్నాయి. నీ పాట రాగాలకి, రాగ రంజితమైన ఆ స్వరానికి నేను నాగు పాములా బందీనై పోయాను! నా నిండు గుండెలో జ్యోతిలా వెలిగి పోతున్నావు! నా గుండెల్లోకి ఒక్కసాగి....అంటేఒక్కసారి త్రొంగిచూడు, నీ పాటతో నా గుండెల గోడలు ప్రతిధ్వనిస్తున్నాయి. బహుశా నీవూ యిదేస్థితిలో వున్నావేమో కదూ!ఎలాగైనా నీకు రేపు చెప్పేస్తాను!

రాధిక క్షణకాలము వూపిరి బిగపట్టింది దగ్గిర దగ్గిర చాలా పేజీల్లో యిలాంటి వర్ణనలే! అప్రయత్నంగా రాధిక కళ్ళు ముందు పేజీలు చదవసాగాయి.

"రాధీ నా మదిలో మమత ఎలా పొంగి పొరలుతోందో తెలుసా? గట్లు తెగి పారేస్థితికి వచ్చింది. ప్రతిరోజు నా కలలో కనికరించేదేవి! నీ కలలో ఎప్పుడైనా కనీసము క్షణకాలమైనా కనిపించానా? ఈ

ప్రేమ సంద్రాన్ని, దరి తెన్ను తెలియని అనురాగ అలలో చిక్కుకున్న నావన్ని, ప్రేమతో చేయూతనిచ్చి. నీదరి చేర్చు కుంటావు కదూ! నీవు పాడే ప్రతి పాట లోని మాటలు ఎంత పుణ్యం చేసు కున్నాయో, కాసేపయినా నీ పెదవుల మీద పవ్వళిస్తాయి! నేను కూడా ఒక పల్లవి నైతే ఎంత బాగుంటుంది? ఎందకో నావి పేరాశ ఏమో ననిపిస్తూంది"

ఎంతటి ఉత్కృష్టమైన ప్రేమో అను కొంది రాధిక, చాలా పేజీలు అలానే వున్నాయి. మరింకొక పేజీలో క్రొత్త విశేషాలు!

"రాధీ....రమ్మనగానే బీచ్‌కి వచ్చావు. నీలో కూడా ఏదో కోరిక వుండి వుంటుంది. లేకపోతే పిలవగానే రావడానికి ఎందుకు ఒప్పుకొంటావు?? కాని నువ్వు నోరు విప్పి నేను ఆశించిన ఒక్క మాట కూడా అనలేదు. ఎప్పటిలా నవ్వుతూ మాటాడి వెళ్ళిపోతున్నావు. రోజూ కంటే నాలో పరిధ్యానం పాలు ఎక్కువవుతోంది. అవి నీ వల్లనే-నిన్నే నేను ధ్యానిస్తున్నది.నాకు ఏమైనా జరిగితే బాధ పడే హృదయము నీకుంది అన్న నగ్న సత్యాన్ని ఈ రోజే తెలుసుకొన్నాక ఆ సంతోషము పట్ట లేకుండా వున్నాను. నీవు పాడుతున్న పాటలోని మధురిమ నాస్వాదిస్తూ, మైమ రచి చెయ్యి నా ఎదురుగా వున్న మైక్ మీద వేశాను. లూజ్ కనెక్షన్ వుందేమో వైర్‌లో షాక్ కొట్టింది. గభాల్న చెయ్యి తీసి వెనక్కి జరిగాను. నీ పాట రక్కున ఆగింది. నీ గొంతులో ప్రస్ఫుటమైన ఆత్రుత, ఆరాటము నా వేదనకి ఆజ్యంలా తోడై మండుతోంది రాధీ. ఈ మంటలకి నా మనస్సు మైనంలా కరిగి పోతోంది. కనీసము ఈ మంటలసెగ అన్నా నీకు తగులుతోందో లేదో!"

మరింకొక రోజు ముందుకు పోయింది రాధిక.

రాధీ-ఎందుకలా వున్నావు. ఈ రోజు పాడే పాట మనిద్దరము ఆఖరిసారి పాడే పాట అని నేను కలలో కూడా అనుకో లేదు. ఆ పాటలో ఆవేదన, దుఃఖము ప్రస్ఫుట మౌతున్నాయి, పాటలోని భావా లకి అనుగుణంగా మన గొంతులు అభిన యిస్తున్నాయి. దుఃఖాన్ని ప్రతిబింబిచే చోట నీ గొంతులో భావాలు చక్కగా స్పష్టమెయ్యాయి! ఇప్పటి వరకు పాడిన పాటల్లో ఈ పాట ఎంత అద్భుతంగా పాడావని! ఈ పాటని డైరీలో నీ గుర్తింపుగా వ్రాసుకోకుండా వుండలేను.

"మబ్బుల మాటున దాగిన జాబిల్లి
మమతల మాటున దాగిన నా చెలీ"

పాట అప్రయత్నంగా రాధిక పెదవులు పాటలోని మాటలతో కదిలాయి, ఆమె కంఠము ఎవరో నొక్కిపట్టినట్లు అయ్యింది ఎటువంటి శబ్దము బయటికి వెలువడ లేదు——

యాంత్రికంగా ముందున్న వాక్యాల మీదకి తన దృష్టి మరల్చింది. రాధికా నీవు

చెప్పే విషయాలేవీ నా తల కెక్కడము లేదు. మీ నాన్నగారి ట్రాన్స్‌ఫర్ గురించే నేను ఆలోచిస్తున్నా. ఆఖరికి నేను చెప్పా లనుకొంటున్న నా కోరిక చెప్పకుండానే మరుగున పడుతోంది.

"సారధిగారు. మనం ఇలా మళ్లీ పాడే అవకాశము జీవితములో ఎప్పుడైనా వుంటుందా''—నీవు అడిగే ప్రశ్న, నా కోరిక ఒకటే! నేను నీకు ఏమని జవాబివ్వను. నేను మూగవాడ్ని రాధికా! మాటామంతీ లేకుండా బండరాయిలా నీ ఎదురుగా కూర్చున్నా! నా ఎదురుగా ఈ చల్లగాలికి కూర్చుని కబుర్లు చెపుతున్న నిన్ను. గబాల్న నా రెండు చేతులతో నిన్ను గాఢంగా గుండెలకి హత్తుకొంటే- నేను చెయ్యలేను. అదే నాలోని బలహీన తేమో! నేను ఒట్టి పిరికివాణ్ణి. అది కాక నీకు నాకు మధ్య ఎన్ని అంతస్తులు? ఆస్తి, అంతస్తు, కులం, మతము, అందము యింకా ఇలాటివి ఎన్నెన్నో. నీవు ఎంతెత్తు అయిన హిమాలయ శిఖరంపైద, ఆకాశానికి అంటుతున్న శిఖరాగ్రంలో వున్నావు. నేను ఆ పర్వతానికి అడుగున. ఎంత దూరం మనిద్దరిమధ్య ఎన్నికష్టాలకైన, ఎంత నష్టానికైన ఓర్చి నిన్ను చేరుకోవాలని నేను ఆరాట పడతున్నా! ఈ సముద్ర ఘోషలాంటి ఆవేదన కనీసము ఒక్కమాటలో నైనా నీకు చెప్పలేక పోతున్నా. నా బలహీనత మీద నాకే అసహ్యమేస్తోంది.'' యింకొక పేజీ త్రిప్పింది రాధిక—

"రాధిక వెళ్ళిపోయింది! పోతూపోతూ నాలో మండుతున్న అగ్నిగుండాన్ని ప్రజ్వలించి, మరీ పోయింది.రాధిక వెళ్లిపోయాక పాడాలనే వుత్సాహం నాలో రోజు రోజుకీ చచ్చిపోతోంది. ఏమిటో ఈ మనుషులకి పిచ్చి—రాధిక వెళ్లాక పాడిన పాటలు చాలా బాగుంటున్నాయని అందరూ మెచ్చుకొంటున్నారు. వాళ్ళకోసము పాడానా? అవి నా రాధిక కోసము! అసలు రేడియో ఎప్పుడైనా వినడానికి తీరిక వుంటుందో లేదో! అసలు నన్ను గురించి ఎప్పుడైనా వినడానికి తీరిక వుంటుందో లేదో! అసలు నన్ను గురించి ఎప్పుడైనా తలుచుకొంటుందో లేదో!


చాలా పేజీలు ఖాళీగా వున్నాయి. కొన్నాళ్లు డైరీలు వ్రాయడము మానేసి వుంటాడు అనుకొంది రాధిక. యింకొక డైరీ తీసింది. అన్ని పేజీలు ఖాళీగానే వున్నాయి. చివరి పేజీలు తప్ప—

డిసెంబరు 12 వ తేది—

రాధీ-నువ్వు వెళ్ళిన ఏడాదికి హైద్రాబాదు వస్తున్నా! పాటకచేరీ చెయ్యడానికి పాటకచేరీ కంటే ముందు నిన్ను చూస్తానవే సంతోషము మనసు నిండా నిండి పొరలుతోంది. యింత హాయిగా నా మనస్సు ఈ మధ్య ఎప్పుడూ లేదు.

డిసెంబరు 13 వ తేది—

కచేరికి వచ్చిన వాళ్ళలో నువ్వు లేవు. నా కళ్ళు అణువణువు కచేరి స్థలాన్ని పరి




శీలించి, నిరాశని బహుమతిగా నాకు వ్రాసిగాయి. అసలు నేను పాట కచేరి చేస్తున్నట్లు నీకు తెలిసి వుండదు. అందుకే మీ యింటికి ఫోన్ చేశాను. సరాసరి మీ యింటికి రావడానికి మనస్కరించటము లేదు.

ఆ సాయంత్రము—

రాధిక మనస్సు గతించిన జ్ఞాపకాలల్లో డైరిలోని సాయంత్రముతో లీనమై పోయింది.

బహుశా ఐదు గంటలై వుంటుంది. చల్ల గాలి సేద తీరుస్తోంది. నీరెండ నిర్మలంగా ప్రవేశిస్తోంది నీవు వస్తా వని పబ్లిక్ గార్డెన్‌లో ఆశగా చెట్టు క్రింద ఎదురుచూస్తూ కూర్చున్నాను. నీవు చెప్పిన టైముకి అరగంట ముందే వచ్చాను. మనస్సులోని ఆరాటాన్ని అణచలేక! సరిగ్గా నీవు చెప్పిన టైము దాటి పదినిమిషాలు అయింది. పంక్చ్యుయాలిటికీ ప్రాధాన్యమిచ్చే నీవు లేట్ చెయ్యడమేమిటి? నీవు రావేమో ననే గుబులు గుండెల్ని అజ్ఞాతంగా కొరుకుతోంది! నిరీక్షణకి నిండు తనము వచ్చింది. నీవు రాలేదు. రాలేదన్న విసుగు విరక్తిలోకి మారే సమయంలో దేవతలా గేటు దగ్గర కనిపించావు. ఎదురు వచ్చిన నన్ను చూచి చిరునవ్వు నవ్వాయి నీ పెదవులు. నా జన్మ సార్థకమయ్యిందనుకొన్నాను. క్షణంలో నీవు రెండు చేతులు జోడించి "నమస్కారం" అన్నావు. నేను నవ్వాను.

"బస్ టైమ్‌కి దొరకలేదు." సమయానికి రాకపోయినందుకు కారణము వివరిస్తున్నట్లు. 'ఫర్వాలేదంటూ' నేను వచ్చటి గుబురు చెట్లమధ్య వున్న లాన్‌లోకి దారి తీశాను. నా వెంట నువ్వూ వచ్చావు. యిద్దరము చెట్టు క్రింద చతికిల పడ్డాము. నువ్వు తలవంచు కొని కూర్చున్నావు నేను నిన్ను తదేకంగా చూస్తున్నాను. కనీసము ఈ రోజైనా నీతో చెప్పాలి.... నేను చెప్పేస్తాను నిన్ను ప్రేమిస్తున్నా మాట్లాడే లోపలే నువ్వు సంభాషణకి వుపక్రమించావు.

'సారధిగారు చాలా రోజుల తర్వాత మిమ్మల్ని ఈ రోజు చూడటం పడినందుకు నాకు చాలా సంతోషంగా వుంది, మీకు ఒక్కసారి అయినా ఈ వూరు రావాలనిపించలేదూ! మర్యాద మన్ననతో నిండి వున్న నీ స్వరం నాకు నవ్వు వచ్చింది జవాబులేక! నన్ను చూడాలని నీకూ అనిపించిందన్న మాట. నా మనసు ఎందుకో నిండుగా వుంది.

"పోనీలెండి యిప్పుడైనా వచ్చారు" నీ సన్నని పెదవులు నవ్వుతున్నాయి నీ తలలోని సంపెంగల సుమపరిమళాలు గాలికి తేలి నా దరి చేరుతున్నాయి. ఈ సంధ్యా సమయాన్ని నా జీవితంలో మరిచిపోలేను! ఎంత మధురంగా వుంది! నీ కన్నులలో ప్రేమవాహినులై ప్రవహిస్తోంది! నా కళ్ళు భ్రమిస్తున్నాయేమో, కాలం కదలకుండా నిలిచిపోతే ఎంత బాగుంటుంది!

పర్సులోనుండి కవరు నా చేతికి అందిచ్చావు. అందులో ఏముందో చూడాలనే ఆత్రం, బహుశా వీటినే చెప్పలేక వ్రాసిన ప్రేమలేఖ అనుకొని నవ్వుకుంటూ కవరు విప్పాను! పసుపు వ్రాసిన ఈ శుభలేఖ! సెంటు వాసన గుప్పున కొడుతోంది. నా ఆశలు, ఆశయాలు తల్ల క్రిందులయ్యాయి. రాధికా నీ ప్రక్కనున్న వరుడెవరు చూడటానికి నాకు మనస్కరించటం లేదు." నన్ను ఎత్తయిన కొండ మీద నుండి అధ:పాతాళానికి విసిరేసి నట్లుగా వుంది! ఇంతకటి ఆనందము అణుమాత్రం కూడా నాలో మిగుల లేదు! పెళ్ళి ఎప్పుడో చూశాను. సరిగ్గా మూడు




రోజుల వ్యవధి వుంది. బలవంతాన లేని ఆనందాన్ని ముఖానికి పులుముకోవాలని వ్యర్థ ప్రయత్నం చేస్తున్నా. పీ పెళ్ళి కార్డు కవరులో పెడుతుంటే అప్రయత్నంగా నా చేతులు వణికాయి.

"నా పెళ్ళికి రారు" రాధిక అడిగింది.

శూన్యంలోకి చూస్తూ రాధిక ప్రశ్నకు జవాబు ఇవ్వలేదు. రాధికను నేను అపార్థం చేసుకొన్నానేమో: లేకపోతే రాధిక నన్ను ప్రేమించి, నాలోని బలహీనత లాంటి దానికి లొంగి తనలో ప్రేమని బహిర్గతం చెయ్యలేక పోయిందేమో! యింకా నా మనస్సు ఆమె మీద అనురాగంతో నాకు అనుగుణంగా ఆలోచిస్తున్నా, నేను వెర్రివాణ్ణి! మండుతున్న మనసు. మరుగుతున్న ఆశలు, బయట వాతావరణంలో మార్పుని నేను గ్రహించలేదు. మసగ్గా చీకటి క్రమ్ముకుంది. మా యిద్దరి మధ్య స్నేహ బంధము. ఆమెలో వుద్వేగాన్ని రేపివుంటాయి. రాధిక కన్నుల్లో అశ్రువులు, కర్చీఫ్ తో తుడుచుకొంటూ ఆమె లేచింది.

"వెళ్ళి వస్తాను నమస్తే'! ఆమె చేతులు జోడించింది. మంచులో తడిసిన మల్లెలా వున్న కళ్ళల్లోకి సూటిగా చూడలేని నేను తలవంచుకొని బస్టాపు దాకా దించి వచ్చాను. ఇదే మా జీవితాలకి ఆఖరి సమాగం! రెండు రోజుల్లో రాధిక పరాయి స్త్రీ అవుతుంది; నేను ఈ బాధ భరించలేను ఆ రోజే బయలుదేరి మెడ్రాస్ వచ్చేశాను.

ఆ వూరు వదిలి వచ్చినా, నా తలలో ఆలోచనలు నన్ను ఎక్కడికీ పారిపోనివ్వకుండా ముప్పిరి గొన్నాయి. అనీగ రాధిక గురించే! నాలానే ప్రేమించి నాకు చెప్పలేక పోయిందేమో! లేకపోతే ఆ కన్నీరు___

అవ్యక్తంగాని బలహీనత మమ్మల్ని విడదీస్తోంది. విధి వంచించిందనుకొనే బదులు నన్ను నేను వంచించుకొన్నాను. నాలోని పిరికితనం నా ఆనందాన్ని బలిగొంది! ఆడపిల్ల నోరు విప్పి ఏం చెబుతుంది! నేనే చెప్పలేకపోతే! అందరిలో వున్న బలహీనత కొంతలో తెగువచేసి త్రెంచుకొంటుంది. నాలో కూడా ఆ తెగువ ఆ చొరవ వుంటే ఎంత బాగుండేది! పెళ్ళికి వస్తానని ఎదురు చూసి, రానందుకు ఏమనుకొందో!

నా బాధ నలుగురితో చెప్పుకొంటే, హర్షించి సానుభూతి చూపగలిగే విశాల హృదయం ఎందరి కుంది? నేను పంపిన బహుమతి. శుభాకాంక్షలు అంది వుంటాయి!

ఈ రోజు నుండి రాధిక జీవితంలో నూతనధ్యాయం' ఇక ఆమెను తలచే అర్హత కూడా లేదు! జీవితంలో ఇదే ఆఖరి అధ్యాయం! త్వరగా ముగిసి పోతే బాగుండు! ప్రేమించడానికి అర్హత ధైర్యం వుండాలి! చూస్తూ చూస్తూ ప్రాణం తీసుకోలేను! నిజాన్ని నమ్మలేను. ప్రేమా-పిచ్చీ ఒకటే అంటారు. ఇందుకే కాబోలు!

పిచ్చి ఎక్కితేనే బాగుంటుంది! పాత జ్ఞాపకాలు నా మనసుని గుచ్చి గుచ్చి తూట్లు పొడుస్తున్నాయి. నేను ఏం చెయ్యలేని నిస్సహాయ స్థితిలో వున్నా. మనసు ముక్కలయ్యాక శాంతి, హాయి ఎక్కడ?——

ఆ తర్వాత సారధి డైరీ వ్రాయలేదు.

చదువుతున్న రాధిక, సారధి బాధలో లీనమై పోయి, కన్నులు నుండి కన్నీరు కురుస్తున్నా ఆ ప్రేమ యత్నమే చెయ్యకుండా అలానే పడుకొంది.


* * *

రాధిక అయిదు. ఆరు రోజులనుండి ఆలోచనలతో సతమతమౌతోంది. కృష్ణమోహన్ ఈ డైరీలు చదివే వుంటాడు. అతని ఎదురుగా నిలబడాలంటేనే ఎందుకో భయంగా వుంది! కృష్ణమోహన్ రాధిక పరిస్థితి తెలిసి వుండి గమనించనట్లు వూరుకొన్నాడు. రాధిక చేసే ప్రతి పనిలో పరధ్యాన్నం తొట్రుపాటం ప్రస్ఫుటమౌతున్నాయి. రాధిక ప్రతికదలికా పరీక్షగా గమనిస్తూనే వున్న కృష్ణమోహన్, అతనికి తెలియని విషయం గూర్చి, ఎన్నోరకాలుగా వూహిస్తున్నారు. ఈ మధ్య అతని మనస్సు ఒకే ఒక విషయం మీద తీవ్రంగా ఆలోచిస్తూంది - సారధి డైరీల్లో రాధిక ఎవరో కాదు, తన అనురాగాన్ని, అప్యాయతని చూరగొంటున్న తన అర్ధాంగి!

ఏ పురుషుడూ సహించలేడు తన భార్యని యింకొకడు ప్రేమిస్తూన్నాడంటే అసలు కలలో కూడా లిప్తకాలం భరించలేడు. ఆ ప్రేమతో పిచ్చి వాడైనటువంటి వాడిని తిరిగి తనే మామూలు మనిషిగా చెయ్యాలి. తన వల్ల నవుతుందా? తన కర్తవ్యం నిర్వర్తించాలి!

నేను అతి సామాన్యమైన మనిషిని. నాకు హృదయ ముంది. దానికి సంస్కారం సహృదయత జాలి వున్నాయి. కాని అవి కొన్నికొన్ని విషయాల్లో కరువౌతావేమో! స్వార్ధం సంస్కారాన్ని, సహృదయతని జయిస్తుంది, స్వార్థానికి. సంస్కారానికి, నా కర్తవ్యానికి మధ్య నేను నలిగిపోతున్నాను! నేను వేటిల్లో దేనికి ప్రథమ స్థానమివ్వాలి? సంస్కారం, సహృదయతతో, నాతోటి మనిషిని. మానవత్వముతోకూడిన మానవుడిగా నా కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. అది కాక సారధి పరాయివాడు కాదు. తన స్నేహితుడు ఒక నాటి చెలికాడు! కాని....కాని స్వార్థం నాకూ, నా ప్రేమకి పరీక్ష పెడుతోంది. ఎంత విశాల హృదయమున్నా——నలుగురిలో నా నైతిక నిలువ దిగజారిపోతుందేమోనన్న భయం! రాధిక నా భార్య అగ్నిసాక్షిగా వేదమంత్రాల వాగ్దానలతో వివాహమాడిన వధువు! పెద్దల ఆశీర్వాదాలు, శుభాశిస్సుల అక్షింతలు తమ యిద్దరిమధ్య మధురమైన మమతల వంతెన వేశాయి! తీవ్రమైన ఆలోచనలతో తల పగలకొట్టుకుంటున్నా ఒక రకంగా స్థిరనిశ్చయానికి వచ్చాడు!

రాధిక చల్లని చూపు కరువయితే సారధి




పిచ్చి కుదరదు సరికదా, యింకా ఎక్కువౌతుంది' అవసరమైతే దీనికోసం నేను భార్యను త్యజించాల్సి వస్తుందేమో ననే భయం: ఆ దుర్భరమైన బాధ ఆ వేదన తను భరించలేడు.—కాని -తను అదే ఆ వేదనతో ఆలమటిస్తున్న మనిషిని, తన కర్తవ్యం విస్మరించి మరచిపోలేడు! అతని నిశ్చయం నిమిషంసేపు కూడా నిలువలేదు. అతని మనస్సు పరిపరి విధాల పోతోంది! ఒక వేళ రాధిక సారథిని ప్రేమించిందేమో! అలా అయితే తనని ఎందుకు వివాహం చేసుకుంది? ఈ నాలుగేళ్ళ వైవాహిక జీవితంలో రాధిక ఏనాడూ అనుమానించడానికి ఆస్కారం యివ్వకుండా నటించిందా? మొన్న హాస్పిటల్‌కి వచ్చినప్పటినుండి రాధిక పూర్తిగా మారిపోయింది. మనసులేని వగవగ ఎవరికీ శాంతి నివ్వదు. ఈ విషయం ముఖాముఖి రాధికని అడిగి తేల్చుకోవాలనే స్థిర నిశ్చయంతో, సరిగ్గా నాలుగు రోజులు మథనపడి, యింట్లో అడుగు పెట్టాడు కృష్ణమోహన్.

ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ ఎదురు వచ్చే రాధిక ఎదురు రాలేదు. సరాసరి ఆ

సమయానికి వంటయింట్లో వుంటుందని వూహిస్తూ వెళ్లాడు. ఆమె అక్కడ లేదు. ఇల్లు అంతా నిశ్శబ్దంగా వుంది. మేడమీద గదిలోకి వెళ్లాడు. గదిఅంతా మసగ్గావుంది. వెలుతురులేదు. రాధిక చేతిలో వున్న పుస్తకంలోకి దీక్షగా చూస్తోంది. లైటు వేసుకోకుండా అసలు ఆ చదువు ఏమిటి? అసలు చదువయితేగా,రాధికనాలుగురోజుల్లో మారిపోయింది. ఆ చలాకీతనం, చిలిపితనం యిప్పుడు మచ్చుకైనా లేవు.బహుంశా తను ప్రేమించిన సారధికోసము తపిస్తోందేమో!

కృష్ణమోహన్ బూట్లచప్పుడు, ఆమెని చైతన్యపరచలేకపోయాయి. కృష్ణమోహన్ వస్తూనే లైటువేశాడు. గది అంతా వెలుగుతో విరాజిల్లుతోంది. లైటువేసిన చప్పుడుకి రాధిక తలెత్తిచూపి తలదించుకొంది.

"రాధి ' అన్నాడు కృష్ణమోహన్ ఆ పిలుపులో ఎటువంటి ఆప్యాయత, అనురాగం లేవు. అతని స్వరం చాలా నిర్వికారంగా వుంది. రాధిక తల ఎత్తలేదు.

"సారధి డైరీల్లో రాధిక, నువ్వు ఒకరేనని నాకు తెలుసుగాని తెలియవల్సిన విషయం యింకా ఒకటుంది."

ఏమిటన్నట్లు తలెత్తి చూసింది రాధిక. ఆమె కన్నులు కృష్ణమోహన్ చూపుల్ని ఎదుర్కొనాయి. రాధిక కన్నుల్లో బాధ సుడులు తిరుగుతోంది. ఆమెను అలా చూస్తూ అడగలేని కృష్ణమోహన్ చూపులు త్రిప్పుకొంటూ—

"నువ్వు....సారధిని ప్రేమించావా?

---

## వెన్నెల్లో విందు

ఒక సినిమా తార కొంతమంది ప్రముఖుల్ని విందుకు ఆహ్వానించింది. ప్రముఖులతోటి సెక్రెటరీలు. జాయింట్ సెక్రెటరీలు, అండర్ సెక్రెటరీలు కూడా విచ్చేశారు. అనుకొన్న విందు పార్టీ బడ్జెట్ తారుమారయింది తారకు. క్షణం ఆలోచించి వూరుకుంది.

పాప్ మ్యూజిక్‌తో వెన్నెల్లో విందు ప్రారంభమైంది. పదార్థాలున్న పాత్రలు సెకండ్లమీద తరిగిపోతున్నాయి. తారకు భయం వేసింది.

"వెన్నెల్లో విందు మనిషి ఆనందిస్తాడా? లేక జంతువా?" సరదాగా అందర్నీ చూస్తూ అంది తార.

"మనిషి ఆనందించినట్లు జంతువు ఎలా ఆనందిస్తుంది?" ఎవరో అతిథి చమత్కరించాడు.

"నిజం! అవి ఆకలి తీరగానే ఆహారం తీసుకోవటం మానేస్తాయి." అర్థం కానట్లు అంది.

అంతే! చేతుల్లో వున్న స్పూన్లు ప్లేట్లలోకి జారాయి. గ్లాసుల్లో నీళ్ళు ఖాళీ అయ్యాయి. త్రేవ్‌మన్న త్రేపులు ఒక్కోరు పదిమార్లు అనసాగారు.

—వ్యాస్‌చంద్

ఎందుకు పెళ్ళి చేసుకోలేదు''

'నేను ప్రేమించలేదు; లేకపోతే మిమల్ని ఎందుకు పెళ్ళి చేసుకొంటాను?' అందామనుకొంది. కాని ఆమె గొంతు పెగలలేదు. గొంతులో నరాలన్నీ ఒక్కసారిగా బిగుసుకుపోయాయి. ముఖంలోకి నెత్తురుపొంగివచ్చి ఎఱ్ఱటికలువలా అయ్యింది. యిది ఎంత సున్నితమైన సమస్య! దీని పరిష్కారం ఏలా? ఏలా? నేను ప్రేమించలేదంటే నమ్ముతారా? మీరు నన్ను అనుమానిస్తున్నారు. లేకపోతే ప్రశ్న ఎందుకు అడుగుతారు? నేను ఏం చెప్పినా మీరు నమ్మలేరు. సారధి డైరీలు అలావున్నాయి. రాధిక మనస్సు తర్కంలోకి దిగింది. అడిగినప్రశ్న ప్రశ్నలానే వుండిపోయింది.

ఎంత సేపటినుండో వుగ్గబట్టుకొన్న సహనం మెల్లిగా కరిగి కోపంలోకి మారింది. జవాబు ఎంతసేపటికి రాకపోయేప్పటికి—

''ఆడవాళ్ళకి అందమైన హృదయాలతో ఆడుకోవటం అలవాటేమో''—

ఎగతాళిగా సాలోచనగా అన్నాడు కృష్ణమోహన్. పౌరుషము, వుక్రోషం ఒకదానితో యింకొకటిపోటీ పడి ముందుకు రాలేక సతమతమౌతుంటే ఏదో చెప్పా అనుకొన్న రాధిక పెదవులు కంపించాయి. ఎటువంటి శబ్దం బయటికి రాలేదు.

''రాధిక! నువ్వు చెప్పలేవు నాకు తెలుసు. నీ రహస్యం బయిట పడింది. చెప్పడానికిమాత్రం ఏముంటుంది. కాని.... నా జీవితంతో ఆడుకునే హక్కు నీకు లేదు.'' వుద్రేకంతో వూగిపోతున్నాడు కృష్ణమోహన్.

రాధిక అతని దూషణని భరించలేనట్లు రెండు చేతుల్తో చెవులు మూసుకొంటూ, తన శక్తినంతా కూడ గట్టుకొని లేచి నిలబడింది.

''నే....ను....సారధి విషయంలో కేవలం ఆదరం, అభిమానం చూపించాను. కాని....కాని అనురాగం ఆప్యాయత మాత్రం కాదు' అంది. దుఃఖంతో రాధిక గొంతు గద్గదమైయ్యింది. మళ్లీ తనే అంది ఎలాగో గొంతు పెగల్చుకొని—

''నా ఆదరణని సారధి అపార్థం చేసుకొన్నాడు. నేను మిమ్మల్ని మోసగించలేదు. కాని నేను భయపడుతున్నట్లే జరుగుతోంది. చివరి మాటలు అస్పష్టంగా వినిపించాయి కృష్ణమోహన్‌కి, అప్పటికే రాధిక రెండు చేతుల్లో మొహం దాచుకొని ఆ గదిలోంచి పారిపోయింది.

కృష్ణమోహన్ రాధిక మాటల అర్థము తనకి సరిగా అర్థమౌతోందా అని ఆలోచిస్తున్నాడు. రాధిక పడే భయమేమిటో సాలోచనగా ఆలోచిస్తూ రెండు అడుగులు వెనక్కివేసి ఆసరాగా వెనక వున్న టేబిల్ మీద చేయి వేశాడు. టేబిల్‌మీద వున్న ఫోటో 'క్రీ'' అని చప్పుడు చేస్తూ వెనక్కిజరిగింది. సామాన్యంగా ఆ బల్లమీద పుస్తకాలుతప్ప మరేమీ వుండవు. ఆ చప్పుడు ఆయాన వస్తువు ఏమిటా అని వెనక్కి

తిరిగాడు. పది నెలల పసివాడి ఫోటో నవ్వుతోంది. నువ్వు ఎంత పెద్ద డాక్టరు వైనా నన్ను దక్కించుకోలేక పోయావు. అని తన తెలివిని వెక్కిరిస్తూ విలాసంగా నవ్వుతున్నట్లుంది. అతని హృదయం కలుక్కుమంది. అన్యమనస్కంగా బల్ల మీదవున్న వస్తువులను పరికించాయి అతని కళ్లు. రాధిక డైరీ పడివున్నది. రాధిక అలా వస్తువుల్ని డైరీలని పైన పడేసే అలవాటు లేదు. ఎంత పరధ్యానంగా లేక పోతే అలా చేస్తుంది, అతని మెదడులో మెరుపులా ఒక ఆలోచన తళుక్కుని మెరిసింది.

'డైరీలు మనసుల ప్రతిబింబా లంటారు. ఒక్కొక్కసారి బయటికి వెళ్ళ గ్రక్క లేనిబాధ డైరీలలో లేఖల్లా వ్రాసుకోగలరు. రాధిక చెప్పిన మాటలు నిజమైతే, బహుశా డైరీలో కూడా అవే వుంటాయి. తన సమస్యకి తేలికగా పరిష్కారం లభిస్తుంది,' అనుకొంటూ రాధిక డైరీని తిరగేశాడు.

అన్నీ తనకి తెలిసిన విషయాలే! తన గురించి ఎంత ప్రేమగా వ్రాసుకొంది! కృష్ణా! నా ఆరాధనా ఈ అనురాగం కలసి హారతిలా వెలిగి, మన యిద్దరి హృదయాలూ ఆ వెలుగులో వె లి గి పో వా లి! కృష్ణా! నిన్ను ఆరాధించే రాధ ఎప్పుడో నీకు ఆత్మార్పణం చేసుకొంది. క్షణకాలం కూడా ఎరుగని బేలను, నీ కోసమై ఎదురు చూస్తే ఈ పరితప్త హృదయానికి, నీవు నా చెంత ఎంత సేపున్నా తృప్తి లేదు.

కృష్ణమోహన్ ముఖంమీద ఒక గర్వరేఖ మెదలింది. తనకి కావాలి వాడి చివరి పేజీలు అనుకొంటూ గబగబా పేజీలు త్రిప్పాడు:

సారధి పేరు కనిపించినచోట 'కృష్ణ మోహన్ కళ్ళు ఆగిపోయాయి. రాధిక డైరీని ఏదో తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు చదువసాగాడు.


"సారధిని హాస్పిటల్‌లో అలా చూస్తా ననుకోలేదు. సారధికి పిచ్చి అంటే మతి పోతోంది. కృష్ణకి ఎలా అయినా చెప్పి సారధి బాగు అవుతాడేమో కనుక్కోవాలి అనుకొన్నా దారిలో. కాని కృష్ణ నా కిచ్చిన డైరీలు! అబ్బ అవి డైరీలు కావు. ఒక మూగ మనసు ఆవేదన! ఆ ఆవేదన నేను అర్థం చేసుకొనేప్పటికి సమయం మించి పోయింది. సారధి! అన్నాళ్ల పరిచయంలో ఒక్కనాడు అంటే ఒక్కనాడు చెప్పి వున్నా నేను ఏం చేసి వుండేదాన్నో! నా కప్పుడు నీ మీద ఎటువంటి అభిప్రాయము లేదు. తోబుట్టువులు లేని నీకు, అది కాక మీ వాళ్ళని వదలి యింత దూరంగా వున్నా వనే వుద్దేశ్యంతో సానుభూతి, ఆదరణా చూపిస్తే అపార్థం చేసుకొన్నావా? నీ మృదు మధురమైన స్వరానికి ఎవరుమటుకు లొంగిపోరు. ఆ మాత్రాన్న అభిమానాన్ని ఆదరణనని—అనురాగం అప్యాయత అని ఎలా అపోహపడ్డావు? నీ మనస్సులోని అభిప్రాయం సూచన మాత్రంగా నాకు తెలిసివుంటే, దాన్ని మొగ్గలో వుండగానే తుంచేసేదాన్ని. నువ్వు నీ ప్రేమ పోసి

పెంచిన కోరిక మహావృక్షమై, పుష్పించి ఫలించకపోతే,నేనుదోషినా? నేనుమాటాడే ప్రతి మాట నీ వూహా ప్రపంచములోనుండి చూస్తే ఆ వేరంగుల్లో కనిపించి వుంటాయి, దానికి నేను ఎంత వరకు బాధ్యురాలని?? అయినా ఎవరు మాత్రం కల గన్నారు ఈ రోజు నీ పరిచయం, నా జీవితాన్ని కలచి వేస్తుంది అని? ప్రేమించడం అందరిచేత కాదు సారధీ! ప్రేమించే ఆత్మ స్థైర్యం మహాబలం వున్నవాడే ప్రేమించాలి. పెదవి విప్పి మనసులోని మాట బయట పెట్టలేని పిరికివాడికి ప్రేమ ఏమిటి? పిచ్చిగాని? ఆఖరికి ఆ పిచ్చే నీ పవిత్ర ధ్యేయంగా చేసుకొని, నా మనస్సుని ఎంత బాధ పెడుతున్నావో నీకేం తెలుసు? ఇవన్నీ చదివిన కృష్ణ ఏమనుకొంటారు? కృష్ణ సంగతి నాకు తెలుసు. ఎలాగూ నన్ను ఈ విషయం అడుగుతారు. ఆ నిశితమైన దృక్కుల్ని తప్పించుకోవటం ఎలా? నేను ఏ విషయం చెప్పినా నమ్మరేమో? సారధీ విషయాలన్ని విశదీకరిద్దామంటే నీకు పిచ్చి! వారికి అనుమానం! బాబూ నువ్వు నాకు మిగిలిన జ్ఞాపకాల గతించిన ఘడియవి! నువ్వు వుంటే ఎలా వుండేదో ఈ పరిస్థితి! మా యిద్దరి అనుబంధము అనురాగాలతో అలరారేది అనుమానాలకి అపార్ధాలకి ఆహుతి అయిపోతోంది! ఏ పురుషుడూ సహజంగా ప్రకృతి సిద్ధంగా సహించలేని తన భార్యని యింకొకడు ప్రేమిస్తున్నాడంటే! తను ఎంతో బాధ పడ్డాక గాని నన్ను అడుగరు వారలాంటి అవమానానికి గురి అవ్వకముందే చచ్చిపోవటం మంచిదనిపిస్తోంది! భగవాన్! నేను ఏం పాపం చేశానని యింత మనోవ్యధ! అటు మనస్థిమితం తప్పిన సారధి ఇటు మండే మనసుతో మరుగుతున్న కృష్ణ! మధ్యలో నేను—ఏటూ తేల్చుకోలేక! ఈ నరకాన్ని నేను భరించలేను. బాబూ! రమ్మని చెయ్యి ఎత్తి పిలిచే నీ ఫోటో చూస్తుంటే నీ దగ్గరికి వచ్చెయ్యాలని నా మనస్సు ఆరాటపడుతోంది! ఈ అమ్మని ఎంత నిర్దయగా వదిలేసి వెళ్ళిపోయావు!''

స్వార్థాన్ని జయించిన మనస్సులో సహృదయత సంస్కారము చోటు చేసుకొన్నాయి. మంచు తెరలు విడిపోయాయి. ప్రతి విషయము వివేకంతో విశదీకరిస్తూన్నట్లుంది. మేధస్సుసంఘర్షణలో నలిగి అశాంతి, ప్రశాంతత చేకూర్చుకొంది.

గదిలో మంచముమీద పడుకొని కుళ్ళి కుళ్ళి ఏడుస్తున్న రాధిక ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకున్న కృష్ణమోహన్, తన తప్పుకి పశ్చాత్తాప పడుతున్న స్వరంతో ''రాధి నేను సామాన్యమైన మనిషిని, నాలోని బలహీనతని జయించలేక నిన్ను అనరాని మాటలు అన్నాను నన్ను క్షమించు....''

అంత ఏడుపులోనూ రాధిక తన చేతిని అతని నోటికి అడ్డుగా పెట్టింది. అనే మాట అసంపూర్తిగానే ఆగిపోయింది.




అతని గుండెల్లో తల దాచుకొన్న ఆమె అలా వుండిపోయింది. ఎన్నడూ ఎరుగని వ్యథతో కన్నీళ్లగా కుమిలిపోయిన మనస్సులు లిప్తకాలం శాంతిని పొందుతున్న క్షణాలు.

* * *

చివరి పేజీ అంతా కన్నీటితో పూర్తిగా కడుక్కుపోయింది. అతి ప్రయాసమీద అక్షరాలన్ని కూడ బలుక్కుంటున్న కృష్ణమోహన్, బాబు ప్రసక్తి, రాధిక నిర్ణయము అతన్ని కలచివేసింది. కన్నీటితో నిండి అతనికనులకి గదిలో వస్తువు లన్నీ అలుక్కుపోయాయి!

''రాధీ! నేను చెప్పేది అర్థమౌతుందా నీ సహాయం లేనిదే పని జరగదు నువ్వు నా మాట వినాలి:''

అప్పటికి అరగంట నుంచి సారధి విషయం వివరంగా చెబుతున్న కృష్ణమోహన్ సూటిగా చెప్పలేక, పరోక్షంగా ప్రబోధిస్తున్నాడు. అప్పటి దాకా ఓపిగ్గా వింటూ కూర్చున్న రాధిక గభాల్న ముఖం త్రిప్పుకొంది. తన చేతి కాదు. తను చేయ లేదు. హే భగవాన్! నాకీ విషమ పరీక్ష పెట్టకు! కనిపించిని దేవుణ్ని ప్రాధేయపడి ప్రార్థిస్తోంది.

యింత సేపటి ప్రయత్నం వృథా అయినా పట్టిన పట్టుదల వదలని కృష్ణమోహన్ కూర్చున్న వాడల్లా లేచి రాధిక

బుజాలు గుచ్చి పట్టుకొని, ఆమె ముఖం లోకి తొంగి చూస్తూ 'చెప్పు రాధీ'' అని బ్రతిమాలు తున్నాడు.

అతనిని విడిపించుకొని లేచిన రాధిక సోఫాని ఆసరగా చేసుకొని నిలబడుతూ, "సారధి ప్రేయసిగా నటించ మంటారు మీరు. ఎంత త్రిప్పి చెప్పినా మీ మాటల అర్థ మవేగా?' అంది తెచ్చిపెట్టుకున్న నిబ్బరంతో కుండ బ్రద్దలు కొట్టినట్టు మాటల్లో దాగున్న నగ్న సత్యాన్ని బయట పడేసింది.

అవునన్నట్లు చూశాడు కృష్ణమోహన్ రాధిక వైపు,




"మీకు దయ లేదు. మనిషి కాదూ! ఎవరైనా భార్యని పరాయి వాడి ప్రేయసిగా నటించమంటారా? మీ యిల్లాలికే మీరు అన్యాయం చేద్దామనుకొంటున్నారా? బాబు బ్రతికి లేడు కాని, వాడుంటే మీరు యిలా అడగ గలిగే వారేనా???' దుఃఖంతో రాధిక గొంతు పూర్తిగా పూడుకు పోయింది

కృష్ణమోహన్ సాహసాన్ని రాధిక మొండి తనం జయించినా, పట్టుదల మాత్రం తన్ని వదిలిపెట్టి పోలేదు. ఆదో రకమైన ఆవేశం అతనిలో చోటు చేసుకొంది.

ఇదేనా సారధి అంటే వున్న అభిమానం? నీ ప్రేమేయం లేకపోయినా, పరోపక్షంగా, అతనిలో ప్రేమ జనించడానికి నువ్వే కారకురాలవు! నిన్ను తలచి, తలచి, తపించి చివరికి మతి స్థిమితం తప్పి నటువంటి స్థితిలో కూడా నిన్నే కోరుకుంటున్నాడు! అతను అలా నిరంతరము నీ కోసం తపిస్తుంటే నీకు తెలిసి- సుఖంగా వుండ గలవా? నీ వల్ల ఒక మనిషి ఈ ప్రపంచానికి దూరంగా వెలి వేయ బడ్డ వాడిలా. జీవచ్ఛవంలా బ్రతుకుతుంటే నీకు మనశ్శాంతి వుంటుందా??"

పరోపక్షంగా ఈ ఘోరానికి కారణం నేను అని తెలుసు కాని, నటించే శక్తి నాకు లేదు. నేను నటిని కాదు. సారధి మీద సానుభూతి వుంది కాని, ఎలా. ఎలా? రాధిక హృదయం ఆక్రోశిస్తుంది? మాటలు బయటికి పెగిలి రావటంలేదు.

అయినా మొండిగా పంతంగాఅంది రాధిక.

'స్నేహలతా కుంజ సౌరభాన్ని ఆస్వాదించే అనురాగ పూర్ణమైన హృదయము కొందరికైనా వుంటుంది. కాని సంసారం లోని సుమ- పరిమళాలను నిస్వార్థంగా పంచి పెట్టే సంస్కారం ఉత్కృష్టమైన మనస్సు ఎందరికుంటుంది? మీరు సరిగా ఆలోచించండి అయినా నాది అంత విశాల హృదయం గాదు.''

రాధిక మొండి తనము కృష్ణమోహన్‌లో విసుగు కలిగించింది. మొండిగా శిలలా నుంచున్న రాధికకి ఎటువంటి మాట అంటే వాడిగా తాగులుతాయా అని ఆలోచిస్తున్నాడు. పోయిన బాబుని మరి పించడానికి యిన్నాళ్ళు తను విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు. తనే గాయాన్ని తెలుసుకున్నాడు! అదే ఆఖరు అస్త్రమైన్నట్లు తన పని సానుకూలమౌతుందనే విశ్వాసంతో తను మంచి పని చేస్తున్నానని ఆత్మతృప్తితో—తెచ్చి పెట్టుకున్న కోపంతో అన్నాడు. ''సారథి వుసురు తగిలే నీ బాబు బ్రతకక లేదు. తెలుసా?'' బెదిరిస్తున్నాట్లుగా వుంది అదేదో నిజమైనట్లు!

రాధిక భయంతో బాధతో పెను తుఫానుకి ఆగలేని లతలా వూగిపోయింది క్షణకాలం! మదిలోని బలహీనతనే బ్రహ్మాస్త్రంలా వుపయోగిస్తే ఏముంది యింక? కృష్ణమోహన్ మాట నిజమేనేమో అనిపిస్తోంది! సారథిని ఆ విధంగా వదిలేస్తే తను చిత్రవధ అనుభవిస్తుంది. తను ఎక్కడున్నా ఆ సంగతి పూర్తిగా తెలుసు. తిక్కగా ఎదురు తిరుగుతున్న మనస్సుని అదుపులో పెట్ట ప్రయత్నిస్తోంది రాధిక.

మెత్తపడుతున్న రాధిక మన స్తత్వం గ్రహించిన కృష్ణమోహన్ ''నువ్వు నా భార్యవి, నాతో పాటు బరువుగా బాధ్యతలు పంచుకోవలసిన దానివి నేను సహృదయంతో అంగీకరిస్తున్నా కాబట్టి నిన్ను ఈ పనికి ప్రోత్సాహిస్తున్నా.', అను నయంగా అన్నాడు.

'నేను మీరు చెప్పినట్లు చేస్తాను. కాని సారథి కోలుకున్నాక నేను నటించానని తెలిసి మళ్ళీ మొదటికి వస్తే?'' అనుమానంతో భయం భయంగా అడిగింది రాధిక.

కృష్ణమోహన్ గుండె నొక్కిపట్టినట్టు అయ్యింది. రాధిక తెలివి తక్కువది కాదు మొహం అటు త్రిప్పుకొని—

''అలా జరగదు'' ఖచ్చితంగా ఆమెకి నమ్మకం కలిగిస్తున్నట్లు పైకి అన్నాడు. కాని అతని అంతరాత్మ ఆక్షణం కూడా వస్తే? రాధీ సారథికోసం నీ జీవితం అంకితమైపోవల్సి వుంటుంది. అది రాధికకి అనుమానం కలుగకుండా అతని ముఖంలో మారే రంగులు ఆమెకి కనిపించ కుండా వుండేందుకు—

'రాధిక అంగీకారానికి సంతోషం ప్రకటిస్తున్నట్లు ఆమెని హృదయానికి హత్తుకొన్నాడు! రాధిక ముఖం అతని విశాల

వక్షస్థలంలో కిమ్మనకుండా దాగింది.

ఆ మర్నాడే సారధిని హాస్పటల్ నుంచి యింటికి తీసుకు వచ్చాడు. రాధిక అతనితో ఎలా ప్రవర్తించాలో క్షణంగా బోధించాడు. సారధి కోసం వాడాల్సిన మందులు తెచ్చి అతి జాగ్రత్తగా ట్రీట్ చెయ్య సాగాడు. రాధిక పాటలే సారధికి ఆయువుపట్టు! పాత పాటలు పాడించి గతస్మృతులు జ్ఞప్తికి వచ్చేటట్లు చేయ సాగాడు.

యిష్టంలేని పని చేస్తున్న రాధిక లోపల అగ్ని పర్వతాలు బ్రద్దలవుతున్నా చిరునవ్వుతో మెదలేది. అది తెలిసి కూడా ఏమి ఎరగనట్లు ప్రవర్తించేవాడు కృష్ణ మోహన్. ఒంటరిగా వున్నప్పుడు రాధిక చివరి ప్రశ్న అతన్ని దహించేసేది. తను తను ఒకవేళ అది అనుకూలించకపోతే రాధికని వదలుకో గలడా? భరించలేని బాధతో కణతలు నొక్కుకునే కృష్ణమో హన్‌ని ఎన్నోసార్లు చూసిన రాధిక నిట్టూర్చడం కన్నా ఏమీ చేయలేక పోయేది.

ఈ మహా వ్యవధికి తోడు బయటవాళ్ళ విసురులు! డాక్టర్ భార్య చేత పేషంటుని ట్రీట్ చేయిస్తున్నాడని! హాస్పిటల్‌లో వాళ్ళకి కృష్ణమోహన్ మీద కబుర్లు చెప్పు డానికి రోజుకున్న ఇరవైనాలుగు గంటలు సరిపోవడం లేదు. లేని పోని రంగులు పూసి, రాధిక విధిలేక కృష్ణమోహన్‌ని పెళ్ళి చేసుకొన్నదని, కట్టుకున్న భర్తని తెలివి తక్కువ వానిగా చేసి, తన ఇష్ట మొచ్చినట్లు ఆటలాడుతోందని యింకా ఇలాంటివి ఎన్నో!

ఒక మంచి పని చెయ్యడానికి సమా జంలోని బలహీనతకు లొంగిపోరు సాహ సికులు ఎవరూ! ఎన్నో రకాలుగా బయట వాళ్ళు తర్కించుకొంటున్నా, వుండబట్టలేక తననే ధైర్యంగా ముఖం మీద అడిగే వాళ్ళకి చిరునవ్వుతో జవాబుచెప్పుతున్నాడు కృష్ణమోహన్! ఏడాదిలో బాగు అవుతాడను కొన్న సారధి ఆరునెలల్లో మామూలు మనిషి అయ్యాడు! రాధిక కృషి, కృష్ణ మోహన్ పట్టుదల విజయాన్ని సాధిం చాయి.

* * *

హాల్లో కృష్ణమోహన్ ఏదో మెడికల్ జనరల్ చదువుకుంటున్నాడు. అతని ప్రక్కన కూర్చున్న రాధిక ఏదో పుస్త కంలో బొమ్మను చూస్తూ యాధాలా పంగా తిరగేస్తోంది. సారధి బయటికి వెళ్ళాడు.

"మీరు సారధికి ఆ విషయం ఎప్పుడు చెబుతారు?" అంది రాధిక.

"ఏ విషయం?" అంటూ పుస్తకం ముయ్యబోయి మళ్ళీ యింకో పేజీ తిరగ వేస్తూ "ఓహో అదా చెబుదాంలే" అన్నాడు లెక్కలేనట్లు.

"ఎప్పుడు ఈ ప్రస్తావన తెచ్చినా, ఈ విషయం మీద అసక్తి లేనట్లు తప్పించుకో వాలని జూస్తారేం?" అంది రాధిక ఎలా

గైనా తేల్చుకోవాలనే పట్టుదల ఆమెలో నానాటికి పెరిగిపోతుంటే కృష్ణమోహన్ చాచేటుగా, సాలోచనగా జవాబిస్తాడు ఎప్పుడూ!

కృష్ణమోహన్ కళ్ళు మూకొని తల వెనక్కి వాలుస్తూ భారంగా నిశ్వసించాడు. ఎలాగు జవాబు చెప్పటం తప్పదు అనుకొంటూ.

'ఆ సక్తి నాకు ఎందుకు లేదు. అనుకున్నవి అనుకునట్లు జరిగితే అంతా మంచి. కాని, ఒక వేళ ఈ వ్యవహారం ఎదురు తిరిగితే, తట్టుకునే స్థితి నీకూ నాకూ ముందు వుండాలి రాధీ. అంతటి ఆత్మ స్థయిర్యం, ఆత్మ బలం వున్నాయో లేవో ముందు చూసుకో వద్దూ, అదీ కాక సారధికి కూడా అంత మనో బలం వుండాలి విని సహించడానికి'' అన్నాడు.

కృష్ణమోహన్ మాటలు అర్థం చేసుకోలేనంత అడవి మనిషి కాదు రాధిక. తెగిన తీగలు ఏ విధంగా శృతి చెయ్యలేమో, గతి తప్పిన ప్రేమని ప్రేమించలేమూ. మెచ్చుకోలేం! ప్రేమరాగం, తల వీణియపై అపశృతి పలికితే తను భరించలేదు

''సంస్కారానికి సహృదయతకి ఒక హద్దు వుంది హద్దులు అతిక్రమిస్తే అమృతం హాలా హాలం అవుతుంది. కట్టుకొన్న భార్య నిదానం చెయ్యడానికి నేను వస్తువుని కాను, మీరు హరిశ్చంద్రుడు కారు: అయినా సారధికి అన్ని విషయాలూ వివరించనా మూర్ఖంగా ప్రవర్తిస్తా డనుకోను! ఒక వేళ అలా ప్రవర్తిస్తే ఆతని మా నాన అతను పోతాడు. సంస్కారం పేరుతో నా సంపర్కాన్ని వదులుకోవా లనుకొంటున్నారు మీరు. మీరు స్నేహానికీ. ప్రేమకీ భేదము కనుక్కోలేక పోతున్నారా? మీకు నా మీద అనుమానం వుండబట్టే మీరు.... మీరు యిలా ప్రవర్తిస్తున్నారు.''

అమానుషమైన అవమానం ఆమెలో ఆరని అగ్నిని లేపింది! కృష్ణమోహన్ మొహం బాధతో క్షణకాలం ముడుచుకు పోయింది. రాధి సంగతి తెలిసి తెలిసి తను అలా అనుకోడు, ఆమె తీవ్రమైన ఆలోచనలు అతన్ని భయపెట్ట సాగాయి. పశ్చాత్తాప పడుతున్న స్వరంతో 'లేదు. రాధి ఈ రోజు చెప్పేస్తాను'' అన్నాడు.

వరండా స్థంభం దగ్గర నీడ కదలినట్లు అయ్యింది. కృష్ణమోహన్ పరికించే లోపలే అడుగుల చప్పుడు, దాని వెనక సారధి చేతిలో పేకట్‌తో ప్రవేశించాడు. తిరిగి తిరిగి అలసిపోయినట్లు వున్నాడు వస్తూనే సారధి చేతిలో వున్న పేకట్ బల్లమీద పడేశాడు. చూడబోతే అతను వాళ్ళ సంభాషణ విన్నట్టే వున్నారు అనుకొన్నాడు కృష్ణమోహన్! ఏం చెయ్యాలో తోచని అతను ఏదో ఒకటి మాట్లాడుతున్నట్లుగా ''ఎక్కడికి వెళ్ళావు? అలా వున్నావేం?' అన్నాడు.

''అబ్బే! ఏం లేదు, బాగానే వున్నాను, తిరిగి తిరిగి అలసిపోయాను అంతే: చల్ల

గాలికి కూర్చుందాంరా అంటూ లాన్‌లోకి దారి తీశాడు.

మెత్తటి గడ్డిలో పడుకొని కృష్ణమోహన్ అటూ ఇటూ దొర్లాడు. అతని దగ్గరే సారధి కూర్చున్నాడు. అతని ముఖంలో స్థిర నిశ్చయం కొట్టవచ్చినట్లు కనపడుతోంది!

'కృష్ణా నా సంగతి అంతా నీకు తెలుసు, నా హృదయంలో నన్ను మనిషిగా మార్చడానికి తాపత్రయ పడ్డావు— మార్చావు. నేను నీ ఋణం తీర్చలేను'' కృతజ్ఞతతో నిండిన సారధి కంఠస్వరం క్షణకాలం ఆగింది. కృష్ణమోహన్ తల ఎత్తి చూశాడు.

''నేను నిన్నొకటి అడుగుతాను సూటిగా చెప్పు, రాధిక మీద నీకు ఎటువంటి అనుమానం లేదు కదూ? కేవలం సహృదయంతోనే రాధికని ఈ పనికి నియోగించావు కదూ?'' అన్నాడు సారధి.

రాధికమీద నాకు ఎటువంటి అనుమానం లేదు అన్నట్లు తల వూపాడు కృష్ణమోహన్.

''కాని నేను రాధికని ప్రేమిస్తున్నాను''

కృష్ణమోహన్ వులిక్కి పడ్డాడు. అది గమనించీ, గమనించనట్లు తన ధోరణిలో ముందుకు సాగిపోయాడు సారధి—

''రాధిక నీ భార్యని నాకు తెలుసు, నా ప్రేయసి, నా రాధ నాలో అలానే వుంది. నా వూహల్లో నా వూపిరిలా అనునిత్యం విహరిస్తూ వుంటుంది. రాధి నా ప్రాణం. నా ప్రేయసి పొరపాటున, కలలో కూడా క్షణకాలం కూడా మరువలేను. కాని రాధిక నీ భార్య నా ప్రేయసి నాలో సజీవంగా జీవిస్తోంది! ఆ రాధకూ నీ రాధికకీ సంబంధం లేదు కృష్ణా! ఆ నాటి క్షణమే నాకు శాశ్వతమైనది. ప్రతిరాబోయే క్షణం గతించిన ఆ క్షణంలో కరిగి పోవాల్సిందే''

సారధి గట్టిగా నిట్టూరుస్తూ క్షణకాలం ఆగాడు.

కృష్ణమోహన్ యిబ్బందిగా అటూ ఇటూ కదిలాడు!


'కృష్ణా, సంస్కారం గల సహృదయత నీకు వుంది. రాధిక నువ్వు లేక పోతే రోజు నీతో యిలా మాటాడే వాడిని కానేమో! నీలో వున్న ఔన్నత్యంలో ఒకటోవంతు అయినా నాలో వుందో లేదో నాలోని బలహీనత, నీవు స్నేహితుడవని విప్పి చెప్పాను, నన్ను క్షమించు! సంస్కారానికి కూడా ఒక హద్దు వుంది, మనలో ఎవరు ఆ హద్దు దాటినా రెండు హృదయాలు బద్దలౌతాయి.''

చివరి మాటలు గద్గదంగా వినిపించాయి కృష్ణమోహన్‌కి, అతను లేచి సారధీ భుజం తట్టుతూ ఓదార్పుగా—

'సారధీ, నీ ప్రేయసి రాధికని ప్రేమిస్తుంటే, మధ్యలో నాకేం బాధ, కాని నాకు నువ్వు మాట యివ్వాలి' అన్నాడు!

ఏమిటన్నట్లు చూశాడు సారధి.

''యిలా తెగిన గాలిపటంలా తిరుగకు.




సాధ్యమైనంత త్వరగా పెళ్ళి చేసుకో! నీ ప్రేయసికి, నీ మనస్సుకి ద్రోహం చెయ్యమని కాదు నేను చెప్పేది తోడుగా వుంటుంది. కాలంతో పాటు మనమూ ముందుకు పోవాలి! అని కాక నువ్వు అలా వుండి పోతే రాధిక బాధ పడుతుంది తన వల్లనే బాధతో కృంగి కృశించి పోయే అవకాశముంది. అతి సున్నితమైన హృదయం కల ఆమెను బాధ పెడతావా?'' అన్నాడు.

సారధి మీద కృష్ణమోహన్ మాటలు బాగానే పనిచేశాయి. ఈ విషమ సమస్య తేలిగ్గా పరిష్కారం జరిగింది. తేలిగ్గా వూపిరి పీల్చుకొన్నాడు కృష్ణమోహన్. అయిష్టంగానే సారధి కృష్ణమోహన్ మాటలు ఒప్పుకొన్నాడు, రెండు రోజుల క్రితం కృష్ణమోహన్ లేనప్పుడు రాధిక చెప్పిన విషయాలు సారధి మదిలో మెదులుతున్నాయి. కృష్ణమోహన్‌ను మనస్ఫూర్తిగా ప్రేమించింది. ఆమెని తను బాధ పెట్టలేడు. చూస్తూ అక్కడ యింకొక్క క్షణం కూడా వుండ లేడు, తనకి కావాల్సింది ఈ రాధికే! పెళ్ళి అయినా పోయినా ఈ రహస్యం తన హృదిలోనే సమాధి అయి పోవాలి, అని స్థిర నిశ్చయానికి వచ్చాడు.

భోజనాంతరము, ఆ రాత్రి తను వెళ్ళిపోతున్నట్లు సారధి రాధకి కృష్ణమోహన్‌కి చెప్పాడు రాధిక సంతోషంగా అతని ప్రయాణానికి అంగీకరించింది సారధిని సాగనంపటానికి రాధిక కృష్ణమోహన్ వరండాలోని ఆఖరి మెట్టు దాకా వచ్చి ఆగిపోయారు వెళ్ళిపోతున్న సారధి చెయ్యి మృదువుగా నొక్కుతూ 'పెళ్ళికి మర్చిపోకుండా పిలువు'' అన్నాడు ''అలాగే' అన్నాడు తల వూపుతూ; రాధిక గుండె కొట్టుకోవటం క్షణ కాలం లయ తప్పింది.

వెళ్ళిపోతున్న సారధిని చూస్తూ అలానే నిల్చున్నారు. మిగిలిన మానవత్వంతో దైవత్వాన్ని సాధించే కృత నిశ్చయంతో కదిలిపోయాడు సారధి

సాగరానికి నదికి చెలియలి కట్ట సరిహద్దు అయి నిలచింది.

స్వార్ధానికి, స్నేహానికి మధ్య సంస్కారం సహృదయం చెలియలి కట్టలా నిలిచిపోయాయి సమాజంలో అత్యున్నతమైన సంస్కారానికి కూడా సరిహద్దు వుంది. నిరూపించాయి మానవత్వం సహృదయం!

జ్యోతి చిన్నకథల పోటీలలో గెలుపొందిన కథ

# దిల్ ఏక్ మందిర్

భోగ లాలసత్వానికి, సమస్త సుఖాలకీ ఆదిమూలం డబ్బు. అది ఉంటే ప్రపంచంలో చాలా వినోదాలూ, విశేషాలూ, అనేక రకాల పాత్రలూ ఆనందించగల సమర్థులు డబ్బుకి దాసోహం అంటారు.

డబ్బులేని వాడికి ఈ ప్రాపంచికపు మాతాలపైన మోజు కల్గిందో, పిచ్చివాడికి కల్లు తాగించి అమ్మవారి జాతరలో విడిచి నట్టుంటుంది. ఆ సమయంలో వాడి చేష్టలు సరిద్దుదామనుకోవడం సాహసమే కదా!

మమత, మానవత్వం ముందు తల ఒగ్గి ఇంటి నించి వెళ్ళిపోయాడు సుశీల భర్త రావ్.

* * *

రావ్‌కి శేఖర్ అనే డాక్టర్ స్నేహితుడున్నాడు. అతనిదొక వింత మనస్తత్వం.

మనిషి, అతనికి వచ్చే బాహ్య రోగాలు ఉద్రేకాలు, నివారణోపాయాలూ అతనికి తెల్సు. మనిషి మనస్సు, మమత, ఈశ్వరమైన మానవత్వంకోసం అతని అన్వేషణ

## శ్రీమతి లక్ష్మి

మత్తువదిలి తన ఉనికి తెలిసి, చేసిన పని సరైనది కాదని పశ్చాత్తాపపడి, అతి అపురూపమైన కోమలి, సౌందర్యరాశి ప్రేమతో శాసించి తన హృదయ సామ్రాజ్యాన్ని దివ్యమైన హుందాతో ఏలే మహా మహారాణి తన భార్య సుశీల, తనబంగారు చిన్నారు లిద్దరూ గుర్తుకొచ్చి క్షణికమైన సుఖాలకు బానిసై, బలహీనతకి లోబడి పోయి,ఎన్నోసార్లుచేసిన వాగ్దానాలు నిల్పుకోలేక పోతున్నందుకు సిగ్గుపడి విరక్తితో

ఈ అన్వేషణలో అతను ఇరుకు సందులకీ వెళ్ళాడు. రాజమార్గాలూ చూశాడు మురికి గోడల పూరిగుడిసెలూ, దేవేంద్ర వైభవాన్ని ఊహకి తెచ్చే విశ్రాంతి భవనాలూ అతని అన్వేషణలో ఉన్నాయి. తన పర భేదం లేకుండా, చేతనైన సహాయం చేస్తూ, సేవలు చేస్తూ, వయస్సు, బాహ్య సౌందర్యం కప్పే పొరల్లో మునిగి పోకుండా, అతినిర్లిప్తంగా, జీవితాన్ని గడుపుతున్న రోజుల్లో చిన్ననాటి స్నేహి

తుడు రావ్ తారసపడేసరికి, మండుటెం డలో దాహంతో పోతున్న వాడికి మంచి నీరు దొరికి నట్టయింది శేఖర్‌కి. అతనిలో అంతర్గతంగా ఉన్న అన్వేషణకి, చిక్కు సమస్యలకి సుశీల వ్యక్తిత్వంలో సమా ధానాలు దొరికాయి. అందుచేత డాక్టర్ ఆమెని ఉన్నత వ్యక్తిగా ఆరాధిస్తాడు. ఆమె వ్యక్తిత్వం కోసం, అభిమానించే స్నేహితుడికోసం తన సర్వస్వాన్నీ అర్పిం చడానికి సిద్ధపడ్డాడు-ఒంటరివాడు, నా అనే పూచీ లేని డాక్టర్.

* * *

సుశీల సార్థక నామదేయ. ఎన్ని కష్టా లైనా ఓర్పుతో, చిరునవ్వుతో స్వీకరించి కర్తవ్య నిర్వహణ కోసం ముందంజ వేయగల సహనశాలి. దుఃఖ జీవుల పాలిటి దయామయి. కామాంధకారుల పాలిటి కాల నాగు: గృహిణిగా, తల్లిగా ప్రేమమయి, అనురాగమయి. సుఖశాంతులకు ఆవాస నిలయం. ఎన్నికష్టాలైనా భరించి పిల్లలకు విద్యా బుద్ధులు చెప్పించి, చక్కని భావి పౌరులుగా తీర్చి దిద్దడమే ఆమె ధ్యేయం. ఇటువంటి మహాసాధ్వి ఐన సుశీలకు ముఖం చూపించడానికి సిగ్గుపడి వెళ్ళి పోయాడు ఆమె భర్త,

సుశీల తన భావాలకూ, ఆశయాలకూ, నమ్మకాలకూ వ్యతిరేకమైన పరిస్థితుల నెదుర్కోవలసి వచ్చినందుకు భయపడదు. ప్రపంచమెన్ని కారు కూతలు కూసినా తన మనస్సుకు నచ్చిన పని చెయ్యడంలో ఆమె ఎన్నడూ సంకోచించదు. పరిస్థితుల కనుకూలంగా తన మనస్తత్వాన్నే మల్చు కున్న కార్యశీలి-సుశీల.

అందువల్లనే తన హృదయాన్ని చూసి జాలిపడిందికాని, విరక్తి చెందలేదు మమత అప్యాయత, మానవత్వం మీద సంపూర్ణ నమ్మకం ఉన్నది గనుకనే తన భర్త ఏనాటికైనా తిరిగి వస్తాడనే ఆశతో నిరీక్షి స్తుంది.

* * *

రోజులు, వారాలు, నెలలు. సంవత్స రాలూ గడిచిపోతున్నాయి. కాని సుశీల భర్త తిరిగి రాలేదు. రాత్రనక, పగలనక శ్రమించి బిడ్డలను పోషించుకుంటూ,వారికి విద్యాబుద్ధులు చెప్పిస్తుంది. అభిమానవతి. అబలఐన సుశీల శేఖర్ సహాయాన్నికాదన లేక, అంగీకరించలేక కొట్టు మిట్టాడు తూంది. శేఖర్ సహృదయం ఆమెకు తెల్సు' సంఘం దృష్టిలో ఆ సహాయానికి అర్థం ఏమిటో కూడా ఆమెకు తెల్సు. కాని ఆమె ధ్యేయం ముందు సంఘానికీ, వ్యర్థమైన మాటలకీ విలువ ఇవ్వ దల్చుకో లేదు.

ప్రపంచంలో ప్రతి స్త్రీ కోరుకొనే అందం, వయస్సు సుశీల పాలిట శత్రు వులే అయ్యాయి.

* * *

రావ్‌ని వెదకడంలో ఎంతో డబ్బు ఖర్చు చేసివిసిగి వేసారిపోయాడు శేఖర్. అతని జాడ తెలియలేదు. చేసే సహాయా

నికి ప్రతిఫలంగా సమాజం విసిరే రాళ్ళు హృదయానికి తగిలి, గాయపడి అబ్బా! అని ఆవేదనతో మూలిగినప్పుడు, ఆబాధను భరించలేక ఒళ్లు తెలియని మత్తులో, మగత లోనూ సంఘం కట్టుబాట్లలోని స్త్రీని చూసి నవ్వుకొనే వాడు తనలో!

* * *

ధనవంతురాలయిన స్త్రీ సమాజంలో పతివ్రతగా గుర్తింప బడుతుంది. డబ్బు, హోదా, కపటంతో కూడిన స్వార్థపరమైన వ్యక్తులు సంఘ సంస్కర్తలు భయపడే వాళ్ళని బెదిరించడం, ఎదురు తిరిగిన వాళ్ళని చెడిపోయిన వారిగా ఏరి పారె య్యడం, నిజాన్ని అబద్ధంగా, అబద్ధాన్ని నిజంగా నిరూపించడం ఒక స్త్రీకి కనీస మానవ ధర్మంగా సహాయపడే వాళ్ళని పతి తులనడం నవసమాజపు లక్షణాలు.

''ఈ శుష్క ప్రపంచానికి, మానవాళికీ అందని ఏ సుదీర్ఘ తీరాలకో పోవాలవిపి స్తుంది. కాని యిద్దరం వెళ్తే ఎలా? పోనీ వారైనా సుఖంగా ఎక్కడో ఒక చోట ఉంటే చాలు'' అనుకునేది సుశీల.

* * *

పెద్ద మనిషిగా చెలామణీ అవుతున్న ఒక సంఘ సంస్కర్త చేత మోసగింప బడి, 'ఇదేనా న్యాయం?' అని అడిగి నందుకు ఆయన ఆగ్రహావేశాలకు గురి అయి చావు బ్రతుకులలో ఒక అనాథ శేఖర్ హాస్పిటల్‌కి వచ్చింది. ఆఖరి క్షణంలో జరి గిన దంతా డాక్టర్‌తో చెప్పి ప్రాణం విడి చింది. ఈ విషయం బయటికి పొక్క కుండా ఉండేందుకు డాక్టర్ని డబ్బుతో తూచబోయాడు పెద్దమనిషి. అందుకు అంగీకరించని శేఖర్ చాలా దారుణమైన ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. పెద్ద మనిషి చాలా ముఠాలకి నాయకుడు. కొన్ని కొన్ని ముఖ్యమైన పనులకి పైగ్రామల లోని తన ముఠా వ్యక్తుల్ని రప్పించి అక్కడ కార్యక్రమం జరిపించేవాడు.

ఇంటినుండి వెళ్ళిపోయిన రావ్ కష్ట పడి పనిచేయడానికి పని దొరకలేదు. నీతి, న్యాయం మొదలైన ధర్మపన్నాలు పాటించడానికి పరిస్థితులు ఎప్పుడూ అను కూలించలేదు. అందుకే అతను అవి నీతికి అలవాటు పడ్డాడు. ఆదరంగా ఆహ్వా నించిన ముఠాలో చేరిపోయాడు. హాయిగా అతని అవసరాలు గడిచిపోతున్నాయి. న్యాయం, ధర్మం అనే వాటి ఉనికినే అతను మర్చిపోయాడు.

* * *

డాక్టర్ని హత్య చేయడానికి పథకం వేయబడింది. దురదృష్టవశాత్తూ రావ్‌ది అందులో ముఖ్య పాత్ర. అతను ఏమి చెయ్యవల్సిందీ ఆదేశించబడిన తరువాత అతని కిచ్చిన ఆదేశం సరిగా నిర్వర్తించ లేకపోతే అతన్నే పూర్తి చెయ్యడానికీ, సరిగా నిర్వర్తిస్తే అంతరంగికునిగా హోదా పెంచడానికి షరతు. ఆ ఊరు వచ్చిన దగ్గర్నించీ భార్య, స్నేహితుడు. పిల్లలు గుర్తుకొచ్చి పిచ్చెత్తిపోతున్నాడు

రావ్. చెయ్యవలసిన పనిపై మనస్సు లగ్నం కావడం లేదు. ఆ ఊరు నుండి ఎంత త్వరగా వెళ్ళిపోదామా అన్పించింది రావ్‌కి. ఆ రాత్రి గడవాలి. అప్పటికే సుశీల గురించి కొంత విని శేఖర్‌కి మనస్సులోనే ధన్యవాదా లర్పించుకున్నాడు

రావ్ ఇంతవరకూ చెడిన వాళ్ళనే చెరిపాడు నీతి, నిజాయితీగల వ్యక్తుల దగ్గరికి అతడు చేరడు వాళ్ళని చూస్తే అతనికి సుశీల గుర్తుకు వస్తుంది. దానితో ఆ ఆలోచనలకే అంకితమైపోయాడు. ఆ రోజు అతను చెయ్యవలసిన పని హత్య అని తెలిపింది 'ఈ రోజుతో నా భార్యాపిల్లలకి శాశ్వతంగా దూరమైపోతున్నాను' అనుకుని, తన విధి నిర్వహణలో బయలుదేరాడు.

* * *

కటికచీకటి.... అన్యాయాలకూ, అక్రమాలకూ అనువైన అంధకారంలో నెమ్మదిగా ఆ ఇంటి వెనుక ప్రహరీగోడ గెంతి లోపల ప్రవేశించాడు రావ్. ఇంతవరకూ ఎన్ని పాపాలు చేసినా వెనుకాడని రావ్‌కు ఈ రోజు ఏందుకో ఏదో చెప్పలేని ఆవేదన కల్గుతూంది. తన చేతిలో నూరేళ్ళు నిండే ఆ అమాయిక ప్రాణి ఎవరో కదా?!.... నెమ్మదిగా అడుగులు వేస్తున్న రావ్‌కు లోపల నుండి ఏవో మాటలు విన్పించి, గదిముందు ఒక్కసారి ఆగేడు.

"ఎంత విద్యనైనా నీకు నేను చెప్పిస్తాను."

రావ్ ఎంత మారినా ఆ ధ్వనిని పోల్చే శక్తిని మాత్రం కోల్పోలేదు.

"మీ నాన్న ఎప్పుడైనా వచ్చి నిన్ను చూసి గర్వపడి మురిసిపోవాలి. ఏదో ఒక రోజు తప్పక వస్తాడు. అతను వచ్చిన మరుక్షణంలో అతనికి మిమ్మల్ని అప్పచెప్పి నేను ఎటైనా పోతాను. అదే అతనికి శిక్ష. మీరు పెద్దయిన తర్వాతనైనా మీ తల్లి సుశీల సార్థకనామధేయురాలని లోకానికి చెప్పండి. అంతవరకూ ఆ అన్యాయకురాలికి ఆగచాట్లు తప్పవు, అబల, పతివ్రత. .' ఆ పైన మాటలు వినే పరిస్థితిలో లేడు రావ్. తను విన్న మాటలు, తను చంపవల్సిన వ్యక్తి 'శేఖర్' అని తెలియగానే ఇక జీవితం నిష్ప్రయోజనం అని తెల్సింది, స్పృహ కోల్పోయే స్థితిలో తనని తనే పొడచేసుకున్నాడు. ఆ నిస్వార్థపరుల మధ్య శేఖర్ పరిగెత్తుకొచ్చి, వెంట వెంటనే చికిత్స చేశాడు. అంతే! అన్ని ఎలా జరగాలో అలా జరిగాయి, రావ్ కోలుకున్నాడు. అన్ని మురాలు పట్టుబడ్డాయి. శేఖర్, రావ్, సుశీల, పిల్లలు దూరతీరాలకు ఎటో వెళ్ళిపోయారు

